

వైభవంగా శ్మశాన కొల్లు

● శ్మశానంలో మత్స్యకారుల జాతర సంబరం

నడినెత్తిన మండుతున్న ఎండ.. చుట్టూ సమాధి దిబ్బలు.. పూనకాలతో ఊగుతున్న భక్తులు.. వారి శరీరాలపై ఛెళ్లుమంటున్న కొరడా దెబ్బలు.. భయంగొలిపే అమ్మవారి ఉగ్ర రూపాలు.. నడి శ్మశానంలో మత్స్యకారుల జాతర అది. అంకాళ పరమేశ్వరీ దేవికి భక్తితో చేసుకున్న కొలుపు తీరిది.

కుప్పం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలో అంకాళ పరమేశ్వరి జాతరను గురువారం మత్స్యకారులు వైభవోపేతంగా నిర్వహించారు. శ్మశాన కొల్ల పేరుతో జరిపే ఈ జాతరను ప్రతియేటా మహాశివరాత్రి వెళ్లిన మరుసటి దినం అమావాస్యనాడు శ్మశానం నడిబొడ్డున జరపడం ఆనవాయితీగా వస్తోంది. తొలుత కొత్తపేటలోని అంకాళ పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు జరిపారు. అక్కడినుంచి ఉగ్రరూపంలో ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలోని శ్మశానం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అప్పటికే శ్మశానం మధ్యలో అమ్మవారి భయంకర రూపాన్ని మట్టితో నేలమీద భీకరంగా తయారు చేసి, పసుపు కుంకుమలు, పూలమాలలతో అలంకరించి ఉంచారు. ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక సరిహద్దులనుంచి తరలివచ్చిన భక్తులతో కుప్పం శ్మశానం నిండిపోయింది. అమ్మవారి రూపాలకు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులిచ్చి, నైవేద్యాలు సమర్పించి వారు మొక్కులు తీర్చుకున్నారు. ఈలోగా చాలామంది భక్తులు పూనకాలతో ఊగిపోయారు. అప్పటికే కొందరు పూజారులు కొరడాలతో సిద్ధంగా ఉన్నారు. వారి ముందు పూనకాలతో ఊగిపోతూ మోకాళ్లపై కూర్చున్న భక్తులపై కొరడాలు ఛెళ్లుమన్నాయి. అంకాళ పరమేశ్వరి జాతరనాడు ఇలా ఆమె సన్నిధిలో కొరడా దెబ్బలు తింటే దెయ్యాలు వదిలి, స్వస్థత పొందుతారని భక్తుల నమ్మకం.శ్మశానంలో తీర్చిదిద్దిన అమ్మవారి రూపంనుంచి మట్టిని తీసుకోవడానికి చివరలో భక్తులు ఎగబడ్డారు. ఈ మట్టిని ఇంట్లో పెట్టుకుంటే శుభం కలుగుతుందన్న నమ్మకంతో అలా చేస్తారు.

పీ4 సర్వేకి కొరవడ్డ సహకారం

● రెండ్రోజుల్లో 2.82 లక్షల కుటుంబాల వివరాల సేకరణ సాధ్యమేనా?

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కటిక పేదవారికి ఆర్థికంగా తోడుగా నిలవాలని భావించిన కూటమి ప్రభుత్వం దారిద్ర్యరేఖకు దిగువన వున్న 20శాతం కుటుంబాల ఆర్థిక స్థితిగతులు తెలుసుకునేందుకు సర్వే చేపట్టింది.వారికి టాప్ 10శాతంలో ఉన్న ఆర్థికంగా నిలదొక్కుకున్నవారు, ఎన్ఆర్ఐల ద్వారా ఆర్థికసాయం చేయించడమే ఈ సర్వే ముఖ్య లక్ష్యం.జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఈనెల 20 నుంచి మార్చి 2వ తేదీ వరకు పీ4(ప్రభుత్వ- ప్రైవేటు - ప్రజల భాగస్వామ్యం) సర్వే చేయాలని ఆదేశాలందాయి. సచివాలయ ఉద్యోగుల సెల్‌ఫోన్లకు పీ-4 సర్వే యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. మార్చి 3 నుంచి 10 వరకు ఈ సమాచారాన్ని క్రోడీకరించనున్నారు.

● కదలని అధికారులు ...

అయితే పేదల ఇండ్లవద్దకు వెళ్లేందుకు అధికారులు, సచివాలయ సిబ్బంది ఆసక్తి చూపడం లేదు. మొత్తం 4,86,848 కుటుంబాల్లో సర్వే చేపట్టాల్సివుండగా, గురువారం నాటికి 41.97శాతం అనగా 2,04,354 కుటుంబాల సర్వే మాత్రమే పూర్తయ్యింది.మిగిలిన 2,82,494 కుటుంబాల సర్వే రెండ్రోజుల్లో చేయడం సాధ్యం కాదు. అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు సర్వేపై శ్రద్ధపెట్టి పర్యవేక్షించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. చాలామంది సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు,ఎనర్జీ అసిస్టెంట్లు,కొందరు వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు సర్వేలో పాల్గొనడం లేదు. మండలాలవారీగా పుంగనూరులో 79శాతం, విజయపురంలో 75శాతం సర్వే పూర్తికాగా, 20శాతం లోపు బంగారుపాళ్యం, 30శాతంలోపు వి.కోట, రామకుప్పం, 40శాతంలోపు 14 మండలాల్లో జరగ్గా, మిగిలిన మండలాల్లో ఆ మధ్యలో ఉంది. ప్రభుత్వం గడువు పొడిగిస్తే తప్ప వివరాల సేకరణ సాధ్యమయ్యేలా లేదు.

మూడు వాహనాలపై ముక్కంటి విహారం





వృషభవాహనంపై భోళాశంకరుడు - రావణబ్రహ్మ వాహనంపై పార్వతీపరమేశ్వరులు - శేషవాహనంపై భక్తవ శంకరుడు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):బంగారుపాళ్యం మండలంలోని మొగిలీశ్వరాలయంలో కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి గురువారం వేకువజామున వృషభవాహనంపై బోళాశంకరుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహాశివరాత్రి రోజు అర్ధరాత్రి లింగోద్భవ దర్శన అనంతరం వృషభ వాహనంపై మాడవీధుల్లో విహరించారు. మాజీ జమీందార్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం ఆలయ ఆవరణలోని త్రిశూల తీర్థంలో స్నానం ఆచరించిన సంతానంలేని మహిళలు స్వామివారి ముందు వరపడ్డారు. గురువారం ఉదయం ఆలయంలోని మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవమూర్తులను రావణబ్రహ్మవాహనంపై ఊరేగించారు. బెంగుళూరుకు చెందిన సుధారాణి,వెంకటరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి శేషవాహనంపై భక్తవ శంకరుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహనసేవలకు కొండేటివాండ్లవూరుకు చెందిన సుమతి,రంగనాథనాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు.ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబీ విజయకుమార్,ఈవో మునిరాజ, అర్చకులు హరికేష్ గురుకుల్, మంజునాథ గురుకుల్, సోము గురుకుల్,దండపాణి గురుకుల్, భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం గజవాహనసేవ, రాత్రి కామదేనువాహన సేవ వుంటాయి.

కందిపప్పు పంపిణీ లేనట్లే..!

● బియ్యం, పంచదారతో సరిపెట్టుకోవాల్సిందే

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్)ను వెన్నాడుతోంది. కందిపప్పును సరఫరా చేసిన కాంట్రాక్టరుకు నెలల తరబడి బకాయిలు చెల్లించకపోవడంతో ఈ నెల రవాణాకు ముందుకు రాలేదు. దీనివల్ల మార్చి నెలకు సంబంధించిన కందిపప్పు రవాణా ఆగిపోయింది. ఈ క్రమంలో బియ్యం, పంచదార కోటాను మాత్రమే పౌరసరఫరాల శాఖ విడుదల చేసింది. జిల్లాలో 5.36 లక్షల రేషన్ కార్డులున్నాయి. ఉచిత పంపిణీ కోసం 8500 టన్నుల బియ్యం, ఐసీడీఎస్, మధ్యాహ్న భోజనం, గర్భిణీ స్త్రీలకోసం అదనంగా 790 టన్నులు జిల్లాకు విడుదలైంది. నగదుపై కార్డుకు అరకిలో వంతున 250 టన్నుల పంచదార కోటా అందింది. దీనిని ఎంఎల్ పాయింట్ల ద్వారా రేషన్ దుకాణాలకు తరలింపును అధికారులు పూర్తిచేశారు. శనివారం నుంచి ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు పంపిణీ చేస్తారు. కాగా, ఐసీడీఎస్, మధ్యాహ్న భోజనం, అంగన్వాడీలకు పంపిణీ చేయడానికి ప్రత్యేకంగా 250 టన్నుల కందిపప్పు కోటాను మాత్రం ప్రభుత్వం విడుదల చేయగా, జిల్లాకు అందింది.

నేడు పాఠశాలల్లో సైన్స్ దినోత్సవం

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా విద్యార్థుల్లోని సృజనాత్మకత, ఆలోచనలను వెలికి తీయడమే లక్ష్యంగా ప్రిన్సిపాల్, హెచ్ఎంలు, భౌతిక, జీవశాస్త్ర ఉపాధ్యాయులు సైన్స్ దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ నుంచి జిల్లాకు ఆదేశాలు అందాయి. అటల్ టింకరింగ్ ల్యాబ్, స్టీమ్ ల్యాబ్, పీఎంశ్రీ ల్యాబ్ మెటీరియల్స్‌తో ప్రయోగాలు చేసేలా ఏర్పాట్లు చేయాలి. ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులు తయారు చేసిన నమూనాలు ప్రదర్శించాలి. 7,8,9 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించాలి.

టీబీ బాధితులకు ఆర్థిక సాయం రూ.వెయ్యికి పెంపు

● 1283 మందికి వర్తింపు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి(టీబీ) బాధితులకు ప్రతినెలా పోషకాహారం నిమిత్తం గత ప్రభుత్వంలో అందజేస్తున్న రూ.500 ఆర్థిక సాయాన్ని రూ.వెయ్యికి పెంచుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాలో మొత్తం 2,862 మంది టీబీ వ్యాధి బాధితులు ఉన్నాయి. వీరిలో చికిత్స తీసుకున్నవారు 1,579 మంది, చికిత్స పొందుతున్నవారు 1,237 మంది, మరో 46 మొండి కేసులు ఉన్నాయని జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ తెలిపారు. వీరిలో 1283 మందికి ఆరు నెలల పాటు రూ.వెయ్యి చొప్పున బాధితుల ఖాతాల్లో జమ చేస్తారని చెప్పారు.

పకడ్బందీగా సీఎం పర్యటన ఏర్పాట్లు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం నాటి గంగాధరనెల్లూరు పర్యటన ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులకు కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. సీఎం ప్రోటోకాల్ కార్యక్రమాల అబ్జర్వర్ వెంకటేష్,ఎస్పీ మణికంఠతో కలిసి సీఎం పర్యటించనున్న బీసీ కాలనీ, దళితవాడలో ప్రజలతో ముఖాముఖికోసం ఏర్పాటు చేసిన ప్రజావేదిక, ఫొటో ఎగ్జిబిషన్, రామానాయుడుపల్లె వద్ద హెలిపాడ్ ఏర్పాట్లను పరిశీలించారు.అధికారులు చేపట్టవలసిన ముందస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యలపై దిశానిర్దేశం చేశారు.ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ హెలిపాడ్, ప్రజావేదిక, సీఎం వెళ్ళనున్న ఇళ్ళ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలన్నారు.కాగా ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను సందర్శించిన డీఐజీ షీముషి బాజ్‌పాయ్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.కాగా వివిధశాఖల అధికారులు, సిబ్బంది కలిసి సీఎం పర్యటనకు అవసరమైన పనులు వేగవంతం చేశారు. చిత్తూరు-పుత్తూరు మెయిన్‌రోడ్డు, గంగాధరనెల్లూరు బీసీకాలనీ, రామానాయుడుపల్లె హెలిపాడ్, గంగాధరనెల్లూరు దళితవాడలోని ప్రజావేదిక, స్టాల్స్ వద్ద, ముళ్ళకంపలను, పిచ్చిమొక్కలను ఎక్స్‌కవేటర్లతో తొలగించారు.ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ మండలాల నుంచి వచ్చిన గ్రీన్‌అంబాసిడర్లు, పంచాయతీల్లో పనిచేసే కూలీలు సుమారు 150మంది పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగిస్తున్నారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో రామానాయుడుపల్లె హెలిపాడ్ ఎంట్రెన్స్ వద్ద పాతవిద్యుత్ స్తంభాలను తొలగించి మరింత ఎత్తుగా ఉండే స్తంభాలను నాటి , కొన్నింటికి ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేస్తున్నారు.సర్పంచ్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో మురుగునీటికాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, కాల్వలపై కడపబండ్లను పేరుస్తున్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పలువురు వీఆర్వోలు ఇంటిపట్టాలు అందించనున్న వారి వివరాలు సేకరించి జిల్లా అధికారులకు అందించడానికి నివేదికలు తయారీలో నిమగ్నమయ్యారు.



రామానాయుడుపల్లెలో సీఎం ప్రోటోకాల్ అబ్జర్వర్ వెంకటేష్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ



గంగాధరనెల్లూరు దళితవాడలో సీఎం ముఖాముఖి కోసం ఏర్పాటవుతున్న ప్రజావేదిక

కమనీయం రథోత్సవం





- శ్రీకాళహస్తీశ్వర, జ్ఞానప్రసూనాంబ దర్శనం
- జనసంద్రమైన శ్రీకాళహస్తి

పెద్ద రథంపై గంగా సమేత శ్రీకాళహస్తీశ్వరుడు. చిన్న రథంపై జ్ఞానప్రసూనాంబ అమ్మవారు. రథాలపై స్వామి, అమ్మవార్ల వైభవాన్ని దర్శించుకునేందుకు మాడవీధుల్లోకి చేరిన భక్తుల శివనామ స్మరణలు. మరోవైపు 'ఓం నమఃశివాయ, హరహర మహాదేవ శంభోశంకరా..' అంటూ పెద్ద రథం మోకులను పట్టి వందలాది మంది భక్తులు లాగడంతో స్వామివారు ముందుకు కదిలారు. ఆ వెనకే 'జై జై కాళి... జై భద్రకాళి' అంటూ అమ్మవారిని స్తుతిస్తూ రథాన్ని లాగారు. ఇలా, స్వామి రథాన్ని అనుసరిస్తూ అమ్మవారూ మరో తేరుపై ముందుకు కదిలారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 11 గంటలకు శ్రీకాళహస్తిలోని చతుర్మాడ వీధుల్లో మొదలైన రథోత్సవం.. మధ్యాహ్నం 2.30 గంటల వరకు సాగింది. రథాలపై భక్తులు ఉప్పు, మిరియాలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు కిందపడిన ఈ మిరియాలను ప్రసాదంగా తీసుకెళ్లారు. అలాగే, రథాలు ముందుకు కదిలేందుకు మాడవీధుల్లో ఇసుక చల్లారు. మరోవైపు రథాల్లోని ఉత్సవమూర్తులను దర్శించుకునేందుకు ఉదయం 9 గంటల నుంచే వచ్చిన భక్తులతో మాడవీధులు కిక్కిరిశాయి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, బీజేపీ నేత కోలా ఆనంద్, ఈవో బాపిరెడ్డి కొబ్బరికాయలు కొట్టి జెండా ఊపి రథోత్సవాన్ని ప్రారంభించారు. ప్రారంభించారు. ఈ రథాలను లాగేందుకు భక్తులు పోటీపడ్డారు.



రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 9 గంటలకు: అధికార నంది, కామధేనువు వాహనసేవ

రాత్రి 10 గంటలకు: శేష, యాళి వాహనసేవ

నేటి రాత్రి శివపార్వతుల కల్యాణం

శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. రాత్రి 10 గంటల తరువాత గజ వాహనంపై శ్రీకాళహస్తీశ్వరుడు, సింహ వాహనంపై జ్ఞానప్రసూనాంబదేవి బయలుదేరి పెండ్లిమండపం వద్దకు వేంచేస్తారు. శనివారం వేకువజామున స్వామివారి కల్యాణం జరగనుంది. బాల్యవివాహాలు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ కల్యాణానికి శుక్రవారం టీటీడీ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

పరమ పావనం.. లింగోద్భవ దర్శనం

మహాశివరాత్రిని పురస్కరించుకుని గురువారం వేకువజామున 4గంటలకు పరమశివుడికి శుద్ధి అభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత లింగోద్భవ అభిషేకం చేశారు. ఈ అభిషేకం పూర్తయ్యాక ఉదయం 6 గంటల వరకు భక్తులను లింగోద్భవ దర్శనానికి అనుమతించారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని మహాలఘు దర్శనం ఏర్పాటు చేశారు.

లాహిరి.. లాహిరి.. లాహిరిలో..

చుట్టుతా విద్యుద్దీప కాంతులు. బాణసంచా వెలుగులు. పుష్కరిణి చుట్టూ చేరిన భక్తజనం. అందంగా అలంకరించిన తెప్పలపై స్వామి, అమ్మవార్లు. ఇలా మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీకాళహస్తిలోని నారద పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేషంగా అలంకరించి, చప్పరాలపై బాబుఅగ్రహారంలోని నారద పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. ఓ తెప్పపై స్వామివారు, మరో తెప్పపై అమ్మవారు పుష్కరిణిలో ఐదు ప్రదక్షిణలు చేశారు. ప్రతి ప్రదక్షిణకు అర్చకులు ప్రత్యేక హారతులు సమర్పించి భక్తులకు చూపారు. భక్తులందరూ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి, ఉభయదాతలు, ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.



- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



ప్రాకారోత్సవంలో పాల్గొన్న అధికారులు, ఉభయదారులు

వైభవంగా ప్రాకారోత్సవం

ఐరాల(కాణిపాకం),ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి):స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న మణికంఠేశ్వరాలయంలో శివరాత్రి తర్వాతిరోజైన గురువారం శివపార్వతులకు ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేసి, స్వామిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం శివపార్వతులను ఆలయ అధికారులు, ఉభయదారులు, భక్తులు తమ భుజస్కంధాలపై మోస్తూ ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో కూలీ మృతి

- నాటుసారాయే కారణమంటున్న కుటుంబం





తలవద్ద నాటుసారా ప్యాకెట్‌తో కన్పించిన నందకేశవన్ మృతదేహం - మృతదేహం వద్ద దీనంగా కూర్చున్న భార్యాబిడ్డలు

కుప్పం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలోని మోట్లచేను పంచాయతీ వాలూరు గ్రామంలో నందికేశవన్ (35) అనే వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు.కుటుంబ సభ్యుల కథనం మేరకు .... వాలూరుకు చెందిన నందికేశవన్ కూలిపనిచేసి జీవనం సాగించేవాడు. అతడికి భార్య నందిని, ముగ్గురు పిల్లలున్నారు. నందిని, తన ముగ్గురు పిల్లలతో కలిసి, తండ్రి రాజప్పతో ఈనెల 25వ తేదీన ఆలయాల సందర్శనకు కర్ణాటక రాష్ట్రం వెళ్లింది. ఆమె గురువారం ఉదయం యాత్రనుంచి తిరిగి వచ్చి చూడగా భర్త నందికేశవన్ ఇంట్లో శవమై కనిపించాడు. అతని తలవద్ద నాటుసారా ప్యాకెట్ పడి వుంది. నందికేశవన్ తరచూ తాగి ఇంటికి వచ్చేవాడు. తాగుడు వద్దన్న భార్యతో గొడవపడేవాడు. ఎక్కువగా నాటుసారా తాగివచ్చేవాడని కుటుంబ సభ్యులు అంటున్నారు. అందువల్లనే అతడు మృతి చెందాడని కూడా వారి ఆరోపణ. కాగా నంది కేశవన్ మృతితో భార్య నందిని, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు అందరూ అనాథలయ్యారు. ఆదుకునేవారు లేక భర్త మృతహం వద్ద దీనంగా కూర్చున్న భార్యాబిడ్డల దీనస్థితిని చూసి కరగని గుండె లేదు. నందికేశవన్ మృతిపై ఆయన కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య తెలిపారు. నాటుసారా స్థావరాలపై దాడులు చేసి నియంత్రించామని, నాటుసారా తాగడంవల్ల మృతిచెందే అవకాశం లేదని ఎక్సైజ్ సీఐ నాగరాజు వివరణ ఇచ్చారు. ఒకవేళ నాటుసారా ఉన్నట్లు తమ దృష్టికి ఎవరైనా తీసుకొస్తే కచ్చితంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎస్వీయూ దూరవిద్యకు యూజీసీ అనుమతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ దూరవిద్యా విభాగానికి యూజీసీ అనుమతులు మంజూరు చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి దూరవిద్యా విభాగం వివిధ కోర్సులు నిర్వహించుకోవడానికి ఆమోదం లభించింది. యూజీసీ పరిధిలోని డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డెబ్) 2022 నుంచీ అనుమతులు మంజూరు చేయలేదు. అనుమతులు ఇవ్వాలని యూనివర్సిటీ నుంచీ యూజీసీకి ప్రతిపాదన వెళ్ళింది. దీంతో డెబ్ బృందం మూడు రోజుల పాటు దూరవిద్యా విభాగం పరిధిలోని ప్రమాణాలు, వసతులు, కోర్సులు వంటి పలు అంశాలను అధ్యయనం చేసింది. ఈ క్రమంలో ఎస్వీయూ దూరవిద్య పరిధిలో 17 కోర్సుల నిర్వహణకు అనుమతిచ్చింది. దీనిపై ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ అనుమతుల వల్ల దూరవిద్యా కోర్సుల్లో ప్రవేశానికి కొత్త నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు తెలిపారు.

ఏనుగుల గుంపు విధ్వంసం

- వరి, కొబ్బరి, మామిడి, అరటి పంటలకు తీవ్ర నష్టం



ధ్వంసమైన డ్రిప్ పైపులు, రాతి కూసాలు



కల్లూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీ కమలాపురంలో బుధవారం రాత్రి పంటలపై ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించాయి. దీంతో వరి, కొబ్బరి, మామిడి, అరటి పంటలకు అపారనష్టం వాటిల్లింది. ఒకే రైతుకు సుమారు రూ.2 లక్షలు విలువైన పంట నష్టం జరిగింది. ఈనెల 23న తిరుపతి జిల్లా కళ్యాణిడ్యాం నుంచి మండలంలోకి ప్రవేశించిన 12 ఏనుగుల గుంపు రెండురోజుల పాటు ఎల్లంకివారిపల్లి పంచాయతీ గోపాలపురం, దిగుమూర్తివారిపల్లి సమీపంలో పంటలను నాశనం చేశాయి. బుధవారం రాత్రి కావేటిగారిపల్లి పంచాయతీ పండబ్బ ఇండ్లు మీదుగా కమలాపురం వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతు మునిరాజ ఆచారికి చెందిన 2 ఎకరాల వరి పంటను పూర్తిగా తినేసిన ఏనుగుల గుంపు సమీపంలోని 10 కొబ్బరిచెట్లు, 20 మామిడిచెట్లు, అరటిచెట్లను, డ్రిప్ పైపులు, బోరుమోటారు పైపులు, విద్యుత్ స్టార్టర్‌ను ధ్వంసం చేశాయి. తోటకు ఏసుకున్న రాతి కూసాలను విరిచేయడంతో సుమారు రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని రైతు మునిరాజ ఆచారి ఆవేదన వ్యక్తం చేశారు. మరో రైతు జయరామాచారికి చెందిన ఎకరా వరి పంటను తొక్కేశాయి. మోహన్‌కు చెందిన ఎకరా వరిపంట, 15 అరటిచెట్లు, 6 మామిడి చెట్లు, 7 రాతి కూసాలలను ధ్వంసం చేశాయి. చెన్నుపాటివారిపల్లిలోని రైతు చంద్రశేఖర్‌నాయుడుకు చెందిన 10 రాతికూసాలను విరిచేశాయి. ఏనుగుల గుంపు అక్కడి నుంచి వచ్చిన దారిలోనే తిరిగి భీమవరం అడవిలోకి చేరుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ఆటోను ఢీకొన్న లారీ

ఆరుగురు భక్తులకు తీవ్రగాయాలు

మరో ముగ్గురికి స్వల్పగాయాలు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో తొమ్మిది మంది భక్తులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం గుడియాత్తంకు చెందిన తొమ్మిది మంది భక్తులు మొగిలిలోని శివాలయానికి బయల్దేరారు. పలమనేరుకొచ్చాక ఓ ఆటో ఎక్కారు. వీరి ఆటో గురువారం మధ్యాహ్నానికి చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని మొగిలి ఘాట్ దొరచెరువు సమీపానికి వచ్చింది. ఆ సమయంలో బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న లారీ వెనుకవైపు నుంచి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పద్మ, కల్పన, తులసమ్మ, ప్రేమ, వెంకటేషన్, మనోహర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన ముగ్గురూ స్వల్పంగా గాయపడ్డారు. బాధితులను 108 వాహనం ద్వారా బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేశాక చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11 గంటలైనా తెరుచుకోని దేవదాయశాఖ కార్యాలయం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాల పనివేళలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వుంటాయి. అయితే చిత్తూరులోని జిల్లా దేవదాయశాఖ కార్యాలయం గురువారం ఉదయం 11 గంటలైనా తెరుచుకోకపోవడంతో కార్యాలయ సిబ్బంది బయటే వేచివుండాల్సివచ్చింది. కార్యాలయ తాళంచెవులు మొగిలీశ్వరాలయంలో ఉన్నాయని తెలియడంతో కార్యాలయ సిబ్బంది నోళ్లు వెళ్ళబెట్టారు. రోజూ పనివేళలు ముగియగానే అసిస్టెంట్ కమిషనరు తాళాలను తీసుకువెళుతుంటారు.ఉదయం కార్యాలయ అటెండర్ ఆయన దగ్గర నుంచి తాళాలు తీసుకొచ్చి శుభ్రపరుస్తుంటారు.అయితే గురువారం 11 గంటలైనా కార్యాలయం తెరుచుకోకపోవడంతో కమిషనరుకు సిబ్బంది ఫోన్ చేశారు.తాళాలు మొగిలి ఆలయం నుంచి వస్తాయని, అంత వరకు వేచి ఉండండని సమాధానమివ్వడంతో మిన్నకుండిపోయారు.

సిద్ధపూజోత్సవంలో ఈవో అలక!

ఎర్రావారిపాళెం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా తలకోనలో జరిగిన సిద్ధపూజ కార్యక్రమంలో ఈవో రవీంద్ర రాజు అలక పూనినట్లు తెలిసింది. కాగా, గతంలో ఇక్కడ పనిచేసి తిరిగి ఈవోగా రవీంద్రరాజు పది రోజుల కిందట వచ్చారు. సిద్ధ పూజోత్సవంలో ఈవో మాటలు అమలు కాకపోవడంతో ఆయన అలకబూనినట్లు తెలిసింది. సిద్ధపూజకు దేవదాయ హారతి ఇవ్వడం, కొబ్బరికాయను కొట్టడం సంప్రదాయం ప్రకారం ఈవోనే మొదట చేపట్టాలి. కానీ ప్రస్తుతం జరిగిన సిద్ధ పూజలో ఈవో అలిగి హారతి ఇవ్వలేదని, టెంకాయ కొట్టలేదని సమాచారం.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు 3నెలల పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును మూడునెలల (మార్చి 1నుంచి మే 31వ తేదీ వరకు)పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు కలెక్టర్, డీఎంఏసీ చైర్మన్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జారీలో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల గడువు శుక్రవారంతో ముగియనుందన్నారు.

మంటలు చెలరేగిన ప్రాంతానికి డీఎఫ్‌వో



మంటలు చెలరేగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో భరణి

గుడుపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వర్ణగిరి క్షేత్రమైన మల్లప్ప కొండలో మంటలు చెలరేగిన అటవీ ప్రాంతాన్ని గురువారం డీఎఫ్‌వో భరణి సందర్శించారు. బుధవారం రాత్రి మల్లప్ప కొండ అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగడంతో కుప్పం అటవీశాఖ అధికారి జయశంకర్ కుప్పం, తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి నుంచి నీటి ట్యాంకర్లను తెప్పించి సిబ్బందితో కలిసి గురువారం ఉదయం వరకు శ్రమించి మంటలను అదుపు చేశారు. దీంతో డీఎఫ్‌వో భరణి మల్లప్పకొండ చేరుకొని మంటలు చెలరేగిన ప్రాంతాలను కాలినడకన వెళ్లి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంటలను కొన్ని గంటల్లో అదుపులోకి తెచ్చిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో పలమనేరు సబ్ డివిజన్ అటవీ అధికారి వేణుగోపాల్, ఎఫ్ఆర్‌వో జయశంకర్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అలీంబాషా

పుంగనూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని.. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అలీం బాషా కోరారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పూల త్యాగరాజు మాట్లాడుతూ గంగజాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని.. ముందస్తుగా సమావేశమై వసతుల ఏర్పాట్లపై చర్చించాలని తెలిపారు. అజెండా అంశాలను కౌన్సిలర్ అమ్ము ఆమోదం తెలపడంతో కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఇతరశాఖల అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు



స్వాధీనం చేసుకున్న నాటుసారా, ద్విచక్ర వాహనంతో పోలీసులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పూజగానిపల్లె క్రాస్ వద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా నల్లగుట్టపల్లెతాండాకు చెందిన శ్రీనివాసులు నాయక్ ద్విచక్రవాహనంలో 46 లీటర్ల నాటుసారా తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. అలాగే మండల పరిధిలో పాత సారా కేసుల్లోని నిందితులు పత్రపల్లె తాండాకు చెందిన హేమంత్‌నాయక్, బుడ్డన్న నాయక్, పెద్దతాండాకు చెందిన రమేష్‌నాయక్, బాలాజీనాయక్, తిప్పానాయక్, రామ్మూర్తినాయక్, శ్రీనివాసులునాయక్, నరసింహులునాయక్‌లను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయించినట్లు పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదంలో పంటలు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొరవభీమగానిపల్లెలోని రైతు చిన్నరెడ్డెప్పకు చెందిన అరటి, వంకాయ పంటలకు గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే దాదాపు రూ.లక్ష విలువ చేసే డ్రిప్ వస్తువులు, పంట కాలిపోయినట్లు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సురేశ్, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, వినోద్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కార్పొరేషన్ రుణాలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు

కుప్పం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు దరఖాస్తుదారులు పోటెత్తారు. మండల సచివాలయంలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 159 యూనిట్లకు గాను ఏకంగా 2 125 మంది దరఖాస్తు చేసుకున్నారు. మండలంలోని 14 పంచాయతీలకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు వందలాది మంది దరఖాస్తుదారులు హాజరయ్యారు. మిగిలిన పంచాయతీలతోపాటు మున్సిపల్ పరిధిలోని దరఖాస్తుదారులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

పూడికతీత పనుల తనిఖీ



పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలో జరుగుతున్న మురుగు కాలువల పూడికతీత పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ఉదయమే పనులు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి పనులు వేగంగా, సంపూర్ణంగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పూడికతీత పనులు పూర్తయిన వెంటనే ఆయా మురుగు కాలువలపై మూతలు ఉంచాలని సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ మురుగు రహిత మున్సిపాలిటీ లక్ష్యంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదర్శానికి అనుగుణంగా కార్యక్రమాలను రూపొందించుకుని అమలు చేస్తున్నామని తెలిపారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



రైతులకు భూసార పత్రాలను అందిస్తున్న ఏవో నాగరాజు

గుడుపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలు చేసుకొని పంటల సాగు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని ఏవో నాగరాజు రైతులకు సూచించారు. గురువారం సోడిగానిపల్లె, కనమనపల్లె, బెగ్గిలపల్లె, అగరం గ్రామాల్లోని రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు వాడాలని.. అప్పుడే నాణ్యమైన దిగుబడులు పొందొచ్చని తెలిపారు. అనంతరం రైతులకు భూసార పత్రాలను అందించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సిబ్బంది, రైతులు, పాల్గొన్నారు.

ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్ఐ శివశంకర్

సోమల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని.. లేకుంటే వాహనాలు నడపొద్దని సోమల ఎస్ఐ శివశంకర్ తెలిపారు. గురువారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో జరిగే నష్టాలను వివరించారు. ప్రయాణంలో తమ రికార్డులను తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం మణీంద్రంకు చెందిన టీడీపీ కార్యకర్త చిన్నక్క గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి పార్టీ నేతలతో కలిసి చిన్నక్క మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి పార్టీ తరపున రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నేతలు మంజునాథరెడ్డి, రామలింగారెడ్డి, వెంకటరమణ, శ్రీరాములురెడ్డి, నాగరాజు, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

11న ద్రావిడ వర్శిటీలో ఉద్యోగ మేళా

కుప్పం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయంలోని గ్రీన్ స్కిల్స్ రెడీనెస్ సెంటర్‌లో ఈనెల 11న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. డిప్లమో, డిగ్రీ చేసిన నిరుద్యోగులకు ఇదే స్కిల్స్ రెడీనెస్ సెంటర్‌లో గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 28న శుక్రవారం సైతం ప్రీ ప్లేస్‌మెంట్ ట్రైనింగ్ ఇస్తున్నామని చెప్పారు. ఇందులో పాల్గొన్న వారికి మాత్రమే 11న నిర్వహించే జాబ్ మేళాలో పాల్గొనే అవకాశం వస్తుందన్నారు. ఇంటర్వ్యూను ఎదుర్కోవడం, స్కిల్స్‌కు అనుగుణమైన రెజ్యూమ్ రాయడం తదితర వివరాలను శిక్షణలో వివరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పీడీ కోరారు.

నేడు కుప్పం మున్సిపాలిటీలో బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

కుప్పం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కుప్పం మండల సచివాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. 1, 2, 3, 4 వార్డులకు టీబీ రోడ్డు ఇండియన్ బ్యాంకు, 5, 6 వార్డులకు ప్యాలెస్ రోడ్డు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, 14, 15, 16, 17 వార్డులకు సప్తగిరి గ్రామీణ బ్యాంకు, 9, 10 వార్డులకు వజ్రవేలుశెట్టి వీధిలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 11, 12, 13 వార్డులకు చిన్నకురబలపల్లెలోని ఇండియన్ బ్యాంక్, 7, 8 వార్డులకు జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు, 18, 19, 20, 21 వార్డులకు కెనరా బ్యాంకు, 22, 23, 24, 26 వార్డులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు రామకుప్పంలో వైద్య శిబిరం

రామకుప్పం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఆర్ఆర్ స్పెషాలిటీ హాస్పిటల్, రామకుప్పం వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రామకుప్పంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ అధినేత సురేష్ మునిరత్నం, ఆలయ కమిటీ పెద్దలు సీతాపతి తెలిపారు. ఆలయ ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెత్తతో సంపద తయారీ కేంద్రం పరిశీలన



ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోఆర్డీ ప్రసాద్

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగినేపల్లె, గొల్లచీమనపల్లె, ఆలప్పల్లె, కంభంపల్లె, గడ్డూరు, తీర్థం, దేవదొడ్డి పంచాయతీల్లో చెత్తతో సంపద తయారీ కేంద్రాలను ఈవోఆర్డీ ప్రసాద్ గురువారం పరిశీలించారు. కార్యదర్శులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌బీఎం మండల కో-ఆర్డినేటర్ సురేష్ బాబు పాల్గొన్నారు.

పలమనేరులో కలప వేలం



అటవీ కలప వేలంలో డీఎఫ్‌వో భరణి

పలమనేరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో గురువారం డీఎఫ్‌వో భరణి సమక్షంలో అటవీశాఖ అధికారులు నిర్వహించిన కలప వేలంతో అటవీశాఖకు రూ. 3,89,710 ఆదాయం లభించింది. వేలంలో పలమనేరు ఏసీఎఫ్ వేణుగోపాల్, ఎఫ్ఆర్‌వో నారాయణ, ఎఫ్ఎస్‌వో సుకుమార్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదు



సీఐ నరసింహరాజుకు ఫిర్యాదు చేస్తున్న ఆర్యవైశ్య మండలి పెద్దలు

పలమనేరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో సుధీర్ అనే వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేశారని పలమనేరులోని ఆర్యవైశ్య మండలి అనుబంధ సంస్థల సభ్యులు, వాసవిక్లబ్, వనిత సభ్యులు గురువారం పలమనేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 23న పలమనేరు సమీపంలోని గజారామం వద్ద అటవీశాఖ అధికారుల అనుమతితో వనభోజన కార్యక్రమం నిర్వహించామని, అందరూ సంతోషంగా గడిపేందుకు ఆటలు, నృత్యాలు చేశామన్నారు. కార్యక్రమంపై సుధీర్ అనే వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ తమ మనోభావాలను దెబ్బతీశారని పలమనేరు సీఐ నరసింహరాజుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యమండలి పెద్దలు ఆర్.వి.సుభాష్‌చంద్రబోస్, ఆర్.వి.బాలాజి, వాసవి క్లబ్ మహిళలు పాల్గొన్నారు.

మల్లేశ్వరుడికి అభిషేకాలు

గుడుపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లెలోని మల్లేశునిగుట్టలో వెలసిన మల్లేశ్వరుడికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు. గుడుపల్లెకు చెందిన మెకానిక్ సింగారు వేలు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నత్తే నయం..!

- చరిత్రకు సాక్ష్యం.. కూర్మవరదరాజస్వామి ఆలయం
- జీర్ణోద్ధరణకు రూ.1.25 కోట్లు మంజూరు
- 2024 మార్చి నుంచి సా..గుతున్న పనులు
- బయల్పడిన రూ.కోట్ల విలువైన విగ్రహాలు
- పట్టించుకోని అధికారులు, నాయకులు





కూర్మ వరదరాజస్వామి ఆలయం, తవ్వకాలలో బయల్పడిన పంచలోహ విగ్రహాలు, నామమాత్రంగా చేపట్టిన ఆలయ జీర్ణోద్ధరణ పనులు

పలమనేరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం కూర్మాయి గ్రామం వద్ద వెలసిన కూర్మవరదరాజ స్వామి ఆలయం చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ ఆలయ జీర్ణోద్ధరణ పనుల కోసం దేవదాయశాఖ నుంచి రూ.1.25 కోట్లను మంజూరు చేయడంతో 2024 మార్చి నుంచి పనులు ప్రారంభించినా ఆ పనులు మాత్రం నత్తను తలపిస్తున్నాయి. ఏడాది కావొస్తున్నా పనులు సా...గుతూనే ఉన్నాయి. జీర్ణోద్ధరణ పనులు చేపడుతుండగా ఆలయంలో కోట్ల విలువైన విగ్రహాలు, పూజా వస్తువులు బయల్పడ్డాయి. ఈ విగ్రహాలను ఇప్పటికీ గ్రామంలోనే భద్రపరచడం గ్రామస్తులకు సవాలుగా మారింది.

● ఆలయ చరిత్ర :

కూర్మ వరద రాజస్వామి ఆలయం 12 వ శతాబ్దంలో నిర్మించబడినట్లు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. మహమ్మదీయుల దండయాత్ర సందర్భంగా ముస్లింలు హిందూ దేవాలయాలను కూల్చివేసి విగ్రహాలను పగులగొడుతున్నారన్న వార్తలు రావడంతో ఆనాడు గ్రామస్తులు కూర్మ వరదరాజస్వామి ఆలయాన్ని ఆలయం పక్కనే ప్రవహించే కౌండిన్య నది నుంచి ఇసుకను, మట్టిని తీసుకొచ్చి పూర్తిగా కప్పేసినట్లు చెబుతున్నారు. ఆ తర్వాత 1950 సంవత్సరంలో కర్ణాటక రాష్ట్రం నంగిలి సమీపంలోని కరిడిగానిపల్లి గ్రామానికి చెందిన చెంగారెడ్డి అనే మోదుబరి రైతు గ్రామానికి వచ్చిన సందర్భంగా గ్రామ పొలిమేరల్లోని మట్టి, ఇసుక కింద కప్పబడిన కూర్మ వరదరాజస్వామి ఆలయ శిఖరాన్ని కనుగొని ఆలయాన్ని బయట ప్రపంచానికి పరిచయం చేసినట్టు గ్రామంలోని వృద్ధులు చెబుతున్నారు. ఆ సమయంలో ఆలయంలోని విగ్రహం చేయి విరిగిపోయిందని.. దీంతో ఇప్పుడున్న విగ్రహం కొత్తగా ప్రతిష్ఠించినట్లు తెలుస్తోంది.

● ఆలయ జీర్ణోద్ధరణ

పురాతనమైన ఈ కూర్మవరదరాజస్వామి ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసేందుకు 2023లోనే ఎండోమెంట్ శాఖ రూ.1.25 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ. 25 లక్షలు గ్రామస్తులు, దాతలు చెల్లిస్తే పనులు చేపడుతామని ఎండోమెంట్ శాఖ చెప్పడంతో ఈ మొత్తాన్ని దాతల నుంచి ఎండోమెంట్‌కు చెల్లించారు. దీంతో 2024 మార్చి నెలలో ఈ ఆలయ జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆలయంలోని గర్భగుడి పునాదులు తవ్వి తీస్తుండగా ఒక విగ్రహం తాలూకు తల కనిపించడంతో జాగ్రత్తగా తవ్వి వెలికి తీశారు. ఆ గర్భగుడి అడుగున సుమారు 2.5 అడుగుల ఎత్తుగల శంఖం, చక్రం ధరించిన శ్రీమహావిష్ణువు, శ్రీదేవి, భూదేవి పంచలోహ విగ్రహాలతో పాటు పూజా కార్యక్రమాలకు వినియోగించే లోహ వస్తువులు సైతం బయట పడ్డాయి. దీంతో వెంటనే గ్రామస్తులు ఆ విగ్రహాలను, పూజా వస్తువులను ఆలయంలోని గర్భగుడిలో ఇదివరకు పూజా కార్యక్రమాలు అందుకొంటున్న కూర్మవరదరాజస్వామి విగ్రహం భద్రపరచిన చోట ఉంచి పూలమాలలు వేసి పూజలు చేపట్టారు. మహమ్మదీయుల దండయాత్ర సందర్భంగా కోట్లు విలువ చేసే ఈ విగ్రహాలను ఆనాడు గర్భగుడిలోనే భూస్థాపితం చేసి ఉంటారని గ్రామస్తులు భావిస్తున్నారు.

నత్తనడకన పనులు

గత ఏడాది మార్చిలో ఆలయ జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించి ఏడాది కావొస్తున్నాన కేవలం పునాదులు సైతం పూర్తికాక పోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండోమెంట్ శాఖకు పనుల కోసం రూ.25 లక్షలు కట్టినా అధికారులు మాత్రం ఆలయ నిర్మాణ పనుల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు ప్రారంభించిన నాటి నుంచి నిర్విరామంగా చేసి ఉంటే ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యేవని గ్రామస్తులు అంటున్నారు. కౌండిన్య నదీ తీరంలో ఉన్న ఈ ఆలయ నిర్మాణ పనులు ఇకనైనా వేగవంతంగా పూర్తిచేయాలని.. బయల్పడిన కోట్ల విలువైన పంచలోహ విగ్రహాల భద్రతపై ప్రభుత్వం, ఎండోమెంట్ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వేలంతో పలమనేరు మున్సిపాలిటీకి రూ.30 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి

పలమనేరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వారపుసంత, దినసరి కూరగాయల మార్కెట్ వేలంతో మున్సిపాలిటీకి రూ.35,43,540 ఆదాయం లభించింది. మున్సిపల్ కమిషనర్ ఎస్.వి. రమణారెడ్డి సమక్షంలో నిర్వహించిన వేలం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి రవిరెడ్డి , మున్సిపల్ సిబ్బంది, గుత్తేదారులు పాల్గొన్నారు.

చెరువులో పడి వివాహిత మృతి



మృతిచెందిన సావిత్రి

గంగవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దుస్తులు ఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి వివాహిత మృతిచెందిన సంఘటన పొన్నమాకులపల్లె గ్రామ సమీపంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గంగవరం మండలం పొన్నమాకులపల్లె గ్రామానికి చెందిన సావిత్రి (38) భర్తతో గొడవపడి గత కొన్నినెలలుగా గ్రామంలోని వారి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. గురువారం దుస్తులు ఉతకడానికి చెరువు వద్దకు వెళ్లింది. దుస్తులు ఉతుకుతుండగా కాలుజారి చెరువలోపడి మునిగిపోయింది. చుట్టుపక్కల వారు గమనించి బయటకు తీయగానే అప్పటికే మృతిచెందింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

ఐఎఫ్‌టీయూ పోస్టర్ల ఆవిష్కరణ



ఐఎఫ్‌టీయూ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రసాద్

పలమనేరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు పి. ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం పలమనేరులో ఐఎఫ్‌టీయూ రెండు విప్లవ కార్మిక సంఘాల రాష్ట్రస్థాయి విలీనసభకు సంబంధించిన పోస్టర్ల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 2న రాజమండ్రి వేదికగా పుష్కరాల రేవు వద్ద రెండు ఐఎఫ్‌టీయూ సంఘాలు విలీన సభను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రాయపనేని హరికృష్ణ, చిత్తూరు ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సుబ్రహ్మణ్యం, చిత్తూరు జిల్లా అధ్యక్షురాలు వి.ఆర్.జ్యోతి, యోగేష్‌బాబు, వెంకటరమణ, వెంకటరమణారెడ్డి, ఆనంద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యాత్రికుల సురక్ష ప్రయాణమే ఆర్టీసీ ధ్యేయం

సోమల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): భక్తుల సురక్ష ప్రయాణమే ధ్యేయంగా ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు తిరుపతి ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జగదీష్ తెలిపారు. గురువారం దుర్గంకొండ ఆలయంలో ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక బస్సులు నడుపుతున్న పుంగనూరు డీఎం సుధాకరయ్యను, సిబ్బందిని అభినందించారు.

నందివాహనంపై ఊరేగిన ఆది దంపతులు



చౌడేపల్లె: బసవేశ్వరస్వామి ఆలయంలో భక్తుల పూజలు



అగ్నిగుండంలోకి ప్రవేశిస్తున్న వీరశైవులు

చౌడేపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రప్పల్లెలో వెలసిన బసవేశ్వరస్వామి ఆలయంలో మహిళలు గురువారం రాత్రి దీపాలు, దివ్వెలు సమర్పించారు. నందివాహనంపై ఆది దంపతుల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఊరేగించారు. స్థానిక బజారు వీధిలో వెలసిన మృత్యుంజయేశ్వరస్వామి, గోసలకురప్పల్లెలో వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి, పుదిపట్లలో వెలసిన పంచలింగేశ్వరస్వామి, ఏ కొత్తకోటలో వెలసిన చంద్రమౌళీశ్వరస్వాములకు లింగోద్భవ సమయంలో పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

సోమల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్గంకొండలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం శివపార్వతుల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు త్రివిక్రమరావు శివపార్వతుల ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించారు. దుర్గంకొండపై శివపార్వతుల ఉత్సవమూర్తులను ఊరేగించారు.

●సదుం: నడిగడ్డలోని మల్లేశ్వరస్వామి, ఊటుపల్లెలో మల్లికార్జునస్వామి, సదుంలో మరకత శివలింగ ఆలయం, ఎర్రాతివారిపల్లె, పాలమందలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో గురువారం ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. సీతమ్మ గుట్టపై వెలసిన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాళభైరేశ్వరస్వామి రథోత్సవం



బైరెడ్డిపల్లె: మండలంలోని తీర్థం - కోట్రేపల్లె సమీపంలోని కాళభైరేశ్వరస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయం వద్ద తీర్థం గ్రామానికి చెందిన విజయకుమార్, బిసేగౌడు కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాజారెడ్డి, అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీనివాసమూర్తి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

పుంగనూరు: పట్టణంలోని ప్యాలెస్ ఆవరణలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిగుండ ప్రవేశం చేశారు. స్వామి వారిని ప్రత్యేక పల్లకిలో పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఉపవాసాలతో స్వామి వారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

పెద్దకురవపల్లెలో పోతులరాజు ఊరేగింపు



రొంపిచెర్ల: బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ పెద్దకురవపల్లెలోని గ్రామదేవత ఎల్లమ్మదేవత ఆలయం నుంచి మంగళ వాయిద్యాలు, చెక్క భజనలతో పోతులరాజును ఊరేగింపుగా రొంపిచెర్ల సమీపంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయానికి తీసుకొచ్చి పూజలు చేశారు. పెద్దగొట్టిగళ్లు ఓంకారేశ్వరస్వామి, రొంపిచెర్ల శ్రీసిద్దేశ్వరస్వామి, మోటుమల్లెల శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి.

మల్లప్పకొండలో ముగిసిన ఉత్సవాలు



గుడుపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్వర్ణగిరి మల్లప్పకొండలోని మల్లేశ్వరుడి ఆలయం లో గురువారం మహా మంగళ హారతి వైభవంగా నిర్వహించారు. ఉదయం శాస్త్రోక్తంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు.

యాళి వాహనంపై ఏకాంబరేశ్వరుడి విహారం



యాదమరి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమంలోని ఏకాంబరేశ్వర కామాక్షి అమ్మవారి ఆలయంలో గురువారం ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం కోరిన కోర్కెలు తీర్చే బోళాశంకరుడిగా యాళి వాహనంపై స్వామివారు గ్రామంలో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. రాత్రి నెమలి వాహనంపై దర్శనమివ్వగా భక్తులు కర్పూర హారతులు పట్టారు. ఉభయదారులు యోగానంద పిళ్లై, దినేష్, ప్రకాష్, బాలాజీ, పురుషోత్తం రెడ్డి, అర్చకుడు కాసలనాటి చంద్రశేఖర్ శాస్త్రి పాల్గొన్నారు.

రేణుకానగర్ వద్ద నూతన కల్వర్టు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెనుమూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు నుంచి చిత్తూరు వెళ్లే మార్గంలో రేణుకానగర్ వద్ద కల్వర్టుకు రంధ్రం పడి ప్రమాదకరంగా మారింది. దీనివల్ల వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని ఆంధ్రజ్యోతిలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ ప్రాంతంలో నూతన కల్వర్టును నిర్మిస్తున్నారు.

అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీవో తదితరులు

నగరి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు నగరి ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరిగాయి. ఆర్డీవో భవాని శంకరి అధ్యక్షతన జరిగిన రెండు పోస్టులకు ఏడుగురు అభ్యర్థులు హాజరైనట్లు సీడీపీవో కృష్ణవేణి తెలిపారు. స్త్రీశిశుసంక్షేమాధికారి వెంకటేశ్వరి, వైద్యాధికారి కీర్తిప్రియ, సీడీపీవో పద్మసునంద పాల్గొన్నారు.

టీచర్ల సర్వీసు రెగ్యులరైజేషన్ జాబితా విడుదల చేయండి: ఆపస్





డీఈవో వరలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న ఆపస్, ఎస్టీయూ నాయకులు

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సర్వీసు రెగ్యులరైజేషన్, మెరిట్ కం రోస్టర్ ప్రకారం సీనియారిటీ జాబితాలు విడుదల చేయాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజి కోరారు. ఈ మేరకు గురువారం డీఈవో వరలక్ష్మిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ సమస్యలతో పాటు మెడికల్ రీయింబర్స్‌మెంట్, బిల్లుల చెల్లింపులు తదితర సమస్యలను తెలియజేశారు. ఏబీఆర్‌ఎస్‌ఎం ఇంటర్మీడియట్ రాష్ట్ర అధ్యక్షుడు శరశ్చంద్ర, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఆపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంజునాథగుప్తా, విజయ్, నాయకులు సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణ, ఉమాపతి, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

'స్పెషల్ ఎడ్యుకేషన్' జాబితాను విడుదల చేయాలని ఎస్టీయూ వినతి

స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల జాబితాను విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్మోహన్, మోహన్ కోరారు. ఈ మేరకు గురువారం డీఈవోను కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్, జిల్లా నాయకులు చంద్రన్, డిల్లీబాబు, సుబ్రహ్మణ్యం, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



ట్రోఫీలు, బహుమతులతో టెన్నికాయిట్ క్రీడాకారులు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో రెండ్రోజులుగా నిర్వహించిన టెన్నికాయిట్ పోటీల్లో సుమారు 30 జట్లు పాల్గొన్నాయి. గురువారంతో పోటీలు ముగియగా, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ.5వేలను సైఫ్, దేవరాజ, రెండో బహుమతి రూ.4వేలను దాము, మార్కొండయ్య, మూడో బహుమతి రూ.3వేలను మునిరత్నం, సునీర్ జట్లు అందుకున్నాయి.

మొగిలీశ్వరుడి హుండీ ఆదాయం రూ.1.54 లక్షలు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మొగిలీశ్వరుడి ఆలయంలో జరిగిన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా హుండీ ద్వారా స్వామికి రూ.1,54,354 ఆదాయం వచ్చినట్లు ధర్మకర్త ఎంబీ విజయ్‌కుమార్, ఈవో మునిరాజ తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుమన్‌ప్రియ ఆధ్వర్యంలో తాత్కాలిక హుండీ లెక్కింపు గురువారం జరిగింది. ఈ మొత్తం ఆదాయం మహాశివరాత్రి పర్వదినం ఒక్కరోజునే వచ్చిందని ఆమె పేర్కొన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్



అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

గుడిపాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నట్లు మాజీ జడ్పీటీసీ బాలాజి నాయుడు, వసంతాపురం మాజీ సర్పంచ్ ప్రతాప్ నాయుడు అన్నారు. గురువారం గుడిపాలలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. బీజేపీ నేత అధ్యక్షుడు ధనుంజయ నాయుడు, ఆనంద్‌యాదవ్, కిట్టు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

- వైసీపీ నేతలకు తెలుగు యువత సవాల్



మీడియాతో మాట్లాడుతున్న వరుణ్ కుమార్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని వైసీపీ నేతలకు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్ కుమార్ సవాల్ విసిరారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌పై వైసీపీ నేతలు నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అసెంబ్లీలో ఒక ఎమ్మెల్యే స్థాయిలో మరో ఎమ్మెల్యే అయిన జగన్ రెడ్డి తీరును ఎండగట్టారని చెప్పారు. గురజాల కేసుల మాఫీ కోసమో, సొంత లాభంకోసమో రాజకీయాల్లోకి రాలేదన్నారు. పుట్టిన ఊరిని అభివృద్ధి చేయాలనే వచ్చారని స్పష్టం చేశారు. తొలి శాసనసభ సమావేశాల్లోనే నియోజకవర్గ అభివృద్ధికి రూ.350 కోట్లు అవసరమని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే కోరారని చెప్పారు. ఇప్పటికే సుమారు రూ.25 కోట్ల అభివృద్ధి పనులు చేశారని.. మరో రూ.25 కోట్ల పనులు జరుగుతున్నాయని వివరించారు. ఇప్పటి వరకు చిత్తూరు కేంద్రంగా 36 ఆర్టీసీ బస్సులను ప్రారంభించారని చెప్పారు. రూ.2.66 కోట్లతో 131 మంది రైతులకు గోకులం షెడ్లు నిర్మించారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి మాట్లాడే అర్హత వైసీపీ నేతలకు లేదన్నారు. తెలుగు మహిళ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం విజయ, బీసీ సెల్ నగర అధ్యక్షుడు ఈశ్వర్, నేతలు మోహన్‌రాజ్, మేషాక్, వెంకటేష్ యాదవ్, గోపాల్ పాల్గొన్నారు.

మీలా దోచుకోలేదు.. ప్రజాసేవ చేస్తున్నాం

- వైసీపీ నేతలపై టీడీపీ నాయకుల ఆగ్రహం



మీడియాతో మాట్లాడుతున్న బాలాజి నాయుడు, సాంబశివ నాయుడు తదితరులు

గుడిపాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 'మీలా దోచుకోలేదు.. ప్రజాసేవ చేస్తున్నాం' అని వైసీపీ నేతలపై గుడిపాల మండల టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మాజీ జడ్పీటీసీ బాలాజి నాయుడు, మాజీ మండల అధికార ప్రతినిధి సాంబశివనాయుడు, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్‌లు గుడిపాలలో మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే గుడిపాల మండలంలో సుమారు రూ.20 కోట్ల వరకు తాగునీటి బోర్లు, గ్రామీణ ప్రాంతాల్లో సీసీరోడ్లు, గోకులం షెడ్లు, పానాటూరుకు తారు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఇవన్నీ వైసీపీ నాయకులకు కనబడలేదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే జగన్మోహన్‌ను విమర్శించే అర్హత వైసీపీ నాయకులకు లేదన్నారు. ఇకనైనా విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలన్నారు. నేతలు నాగరాజ్ యాదవ్, శంకర్‌చౌదరి, నిత్యానందం, చిట్టియాదవ్, ప్రతాప్ నాయుడు, జయదేవనాయుడు, చందు, రామ్మూర్తి నాయుడు, గోపి, శేఖర్ నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా శ్మశాన కొల్ల





క్రేన్‌కున్న కొక్కేలకు వేలాడుతూ అమ్మవారికి పూలమాల వేస్తున్న భక్తులు (ఇన్‌సెట్లో) అమ్మవారు, దక్షుడి ప్రతిమ

నగరి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్ పరిధిలోని సత్రవాడలో అంకాలపరమేశ్వరి ఆలయంలో గురువారం శ్మశాన కొల్ల (మయాన కొల్ల)ను వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి తర్వాత ప్రతి ఏడాది కుశస్థలీ నది గట్టున ఈ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పర్వతరాజ కులస్తులు తరతరాలుగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కుశస్థలీ నదిలో సుమారు 20 అడుగుల దక్షుణి మట్టిబొమ్మను తయారుచేశారు. ఆనవాయితీ ప్రకారం మట్టిబొమ్మపై భక్తులు కుంభం వేసి మొక్కుకున్నారు. అంకాళ పరమేశ్వరి అమ్మవారు మహిషాసురమర్దినిగా అలంకరించారు. భక్తులు తమ శరీరానికి ఇనుపకొక్కీలను గుచ్చుకుని క్రేన్‌కు కట్టిన తాడుకు వేలాడుతూ అమ్మవారికి పూలదండలు వేశారు. అనంతరం అమ్మవారిని ఊరేగింపుగా నది వద్దకు తీసుకొచ్చారు. దక్షవధకు ప్రతీకగా ఏర్పాటు చేసిన దక్షుడి బొమ్మ చుట్టూ అమ్మవారి విగ్రహాన్ని మూడుసార్లు ప్రదక్షిణ చేయించారు. అనంతరం అక్కడ ఉంచిన ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

బొమ్మసముద్రంలో..



ఊరేగింపుగా వెళ్తున్న అంకాళపరమేశ్వరి

గుడిపాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మసముద్రంలో గురువారం శ్మశానకొల్లను ఆవిశెట్టి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంకాళ పరమేశ్వరిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు చేసి, కుంభం సమర్పించి, పూజలు నిర్వహించారు. అమ్మవారిని పుష్పపల్లకిలో ఊరేగించారు.

కమనీయంగా శివపార్వతుల కల్యాణోత్సవం





అరుణగిరి క్షేత్రంలో శివపార్వతుల కల్యాణోత్సవం (ఇన్‌సెట్లో) తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మాంబేడు గ్రామ పంచాయతీ డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలోని జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో గురువారం శాస్త్రోక్తంగా శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కృష్ణమోహన్‌రెడ్డి, కార్యనిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ● ఎగువ కన్నికాపురం సమీపంలోని మరకతవల్లీ సమేత స్వయంభు సిద్ధేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాలు గురువారం ధ్వజావరోహణంతో ముగిశాయి. ఏర్పాట్లను ధర్మకర్త శిరిపిరెడ్డి అరుణమ్మ పర్యవేక్షించారు.

జ్ఞాన యజ్ఞేశ్వర సమేత ప్రసూనాంబ ఆలయంలో..



గుడిపాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 197 రామాపురంలోని జ్ఞాన యజ్ఞేశ్వర సమేత ప్రసూనాంబ ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఆలయ ధర్మకర్త ఆనంద్, కమిటీ సభ్యులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో కమనీయంగా నిర్వహించారు. గురువారం వసంతాలతో శివరాత్రి ఉత్సవాలను ముగించారు. ఎంపీడీవో శివరాజ్, తహసీల్దార్ జయంతి, ఎస్‌ఐ రామ్మోహన్ కుటుంబీకులు పట్టువస్త్రాలు సమర్పించారు. నాయకులు గురజాల జగ్జీవన్, చెన్నకేశవులు నాయుడు, బీజేపీ జిల్లా నాయకుడు చిట్టిబాబు, సర్పంచ్ గుర్రప్ప నాయుడు, కూటమి నేతలు పాల్గొన్నారు.

కాలభైరవేశ్వరస్వామి ఆలయంలో..



తవణంపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె కాలభైరవేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక ఉత్సవాల్లో భాగంగా గురువారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారు అశ్వవాహనంపై విహరించారు. ఉభయదారులు, కార్యనిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు



పూలరథం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు గురువారం గ్రామోత్సవంతో ముగిశాయి. స్వామి, అమ్మవార్లను పూలరథంపై ఊరేగించారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఎంపీడీవో అమరనాథ్ నేతృత్వంలో ఇంటర్వ్యూలు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. 68 యూనిట్లు మంజూరవగా, 446 మంది దరఖాస్తు చేసుకున్నారు.

విజయపురం: ఎంపీడీవో కార్యాలయంలో రుణాల కోసం జరిగిన ఇంటర్వ్యూలకు 144 మంది దరఖాస్తు చేసుకోగా, 111 మంది హాజరయ్యారని ఎంపీడీవో రాజేంద్ర తెలిపారు.

పెనుమూరు: ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తుదారులకు ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరిగాయి. మండలానికి 75 యూనిట్లు కేటాయించగా, 450 మంది దరఖాస్తు చేసుకున్నారు.

యాదమరి: ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఇంటర్వ్యూలకు 412 మంది దరఖాస్తు చేసుకోగా, 278 మంది హాజరైనట్లు ఎంపీడీవో వేణు తెలిపారు.

గుడిపాల: ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 99 యూనిట్లకుగాను 341 మంది దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీవో శివరాజ్, గుడిపాల సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రజినీకాంత్ తెలిపారు.

నగరి: మెప్మా కార్యాలయంలోనూ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 487 దరఖాస్తు చేసుకోగా, 423 మంది హాజరయ్యారని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు.



నగరి మెప్మా కార్యాలయంలో దరఖాస్తుదారుల రద్దీ

సంక్షిప్తంగా..

నామినేటెడ్ పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించండి

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి పి.షణ్ముగం కోరారు. గురువారం మచిలీపట్నంలో మైన్స్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కోసం పనిచేసిన బీసీ నాయకులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

బైకు ఢీకొని ఒకరి మృతి



చొక్కలింగం (ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బైకు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. కార్వేటినగరం ఎస్‌ఐ పి.రాజ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. అల్లాగుంటకు చెందిన చొక్కలింగం(58) గ్రామ సమీపంలో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి పక్కన నిల్చొని ఉన్నాడు. ఆ సమయంలో వెదురుకుప్పానికి చెందిన ఓ యువకుడు బైకు వెళ్తూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చొక్కలింగం తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు కార్వేటినగరం సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, బైకుతో ఢీకొన్న యువకుడికి కూడా తీవ్రగాయాలవగా చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆక్రమణలు తొలగించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న హేమాద్రి నాయుడు

గుడిపాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లె నుంచి దాయంవారిపల్లెకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించాలని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు, మాజీ సర్పంచ్ పళని, గ్రామకమిటీ అధ్యక్షుడు మహదేవన్ కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ జయంతికి వినతిపత్రం అందజేశారు. ఈ రోడ్డును సర్వే చేసి సమస్యను పరిష్కరించాలన్నారు.

వార్డు సచివాలయంలో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఐదో వార్డు సచివాలయాన్ని కమిషనర్ నరసింహప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం కొంగారెడ్డిపల్లె, పుత్తూరు రోడ్డులో పారిశుధ్య నిర్వహణ, ఇంజనీరింగ్ పనులను పరిశీలించారు. పుత్తూరు రోడ్డులో సెంట్రల్ లైటింగ్ పనులకు అంచనాలను తయారు చేయాలన్నారు. నగరంలో లైటింగ్ వ్యవస్థ సెన్సార్‌తో పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఎంహెచ్‌వో లోకేష్ పాల్గొన్నారు.